క్లుప్తంగా

సలేశ్వరం జాతరకు ప్రత్యేక బస్సులు

కల్వకుర్తి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం సలేశ్వరం లింగమయ్య జాతరకు కల్వకుర్తి డిపో పరిధి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లుగా డిపో మేనేజర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని, పెద్దలకు రూ.240, పిల్లలకు రూ.120 బస్‌చార్జీలుగా నిర్ణయించామని తెలియజేశారు. లింగమయ్య భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెద్దకొత్తపల్లి: సలేశ్వరం జాతరకు ఈ నెల 5 నుంచి 7 వరకు నాగర్‌కర్నూల్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కస్టమర్ రీజినల్ కోఆర్డినేటర్ ఈఎస్ నారాయణ తెలియజేశారు. మండల కేంద్రంలో సలేశ్వరం జాతర ప్రత్యేక బస్సుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ నుంచి పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100 టికెట్ నిర్ణయించినట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ నుంచి ప్రత్యేక బస్సులో సలేశ్వరం జాతర వెళ్లి లింగమయ్యను దర్శించుకోవాలన్నారు.

లైసెన్స్ ఉన్న వాహనాలే నడపాలి



పెద్దకొత్తపల్లి: రోడ్లపై లైసెన్స్ ఉన్న ట్రాక్టర్లు, బొలెరోలు, ఇతర వాహనాలనే నడపాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రుతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులు సామర్థ్యానికి మించి ప్రయాణించవద్దని సూచించారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వరి, బాలసరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

‘అభ్యంతరాలు తెలియజేయండి’

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారందరి జాబితా ఆయా వార్డుల్లో ప్రదర్శించామని కమిషనర్ ఆక్రిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు, అనర్హులు ఎవరైనా జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే సోమవారం లోగా వారి అభ్యంతరాలను లిఖితపూర్వకంగా మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా ఫయాజ్




కొల్లాపూర్: సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎండీ.ఫయాజ్ ఎన్నికయ్యారు. మంగళవారం కొల్లాపూర్‌లోని కేఎల్ఐ అతిథిగృహంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, ఆయన సమక్షంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఫయాజ్ అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చూడటంతో పాటు అక్కడక్కడ లీకేజీలను సరిచేయాలన్నారు. ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ ప్రవీణ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.1.30 లక్షల విరాళం

వెల్దండ: మండలంలోని ఉబ్బలగట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని రావిచెట్టుబావి తండాలోని మున్నాసాద్ దేవాలయ అభివృద్ధికి మంగళవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.30 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఐక్యత ఫౌండేషన్ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేసి వారి ఉన్నత చదువులకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. కిమ్యానాయక్, శ్రీను, వెంకట్, పంతునాయక్, అమ్మునాయక్, గోపాల్ ఉన్నారు.



పథకాలు పేదలకు వరం


వెల్దండలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరంగా మారాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం అమలు చేయడంతో పేద ప్రజలకు వరంగా మారిందని, దీంతో ఎంతో మంది పేదింటి అమ్మాయిలకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా మారాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లోని ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేసి, వ్యవసాయ పెట్టుబడికి ఎకరానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతు కుటుంబ పెద్ద ప్రమాదంలో మృతి చెందితే వారికి ప్రభుత్వం అండగా ఉండి రూ.5 లక్షలు అందిస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు దేశంలోనే అనేక రాష్ట్రాల నాయకులు ఆదర్శంగా తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో 59 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, వైస్‌ఎంపీపీ శాంతి, తహసీల్దార్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ మోహన్‌లాల్, భూపతిరెడ్డి, అంజినాయక్, గుత్తి వెంకటయ్య, రాములు, జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పక రథోత్సవం


లింగాలలో రథోత్సవం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున పుష్పక రథోత్సవం(చిన్నతేరు) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు రథాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అంకరించారు. రథంలో ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగించారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు రామాచారి, సుదర్శనాచారి, బళ్లారి నాగేశ్వర్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ దామోదర్‌రెడ్డి ధ్వజారోహణం చేశారు. పూజల్లో మాజీ ఎంపీ మంద జగన్నాథం, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఎడ్మ సత్యం, శ్రీశైలం, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మెలగాలి

సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో మెలగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారీ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవచింతనతో మెలిగితే సుఖసంతోషాలతో జీవించగలుగుతారని అన్నారు. నర్సింహ, రవిగౌడ్, దుర్గా ప్రసాద్ పలువురు ఉన్నారు.


కల్వకుర్తి గోపూజలో పాల్గొన్న భక్తులు

విద్యార్థినికి అస్వస్థత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని జేపీనగర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థినికి కొంత అస్వస్థత ఏర్పడింది. ఎంఈఓ బాసునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జేపీనగర్ పాఠశాలలో ఊర్కొండ మండల రాంరెడ్డిపల్లికి చెందిన అంజలి పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చింది. పరీక్ష ప్రారంభమైన అరగంటకు విద్యార్థిని వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడింది. వెంటనే అక్కడి పరీక్ష కేంద్రం సిబ్బంది 108కు ఫోన్ చేయగా.. పరీక్ష కేంద్రంలోనే అంబులెన్స్‌లో ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థిని కొంత కుదుటపడ్డాక తిరిగి పరీక్ష రాయించారు. తన తల్లి కూడా ఆ సమయానికి అక్కడే ఉండటంతో విద్యార్థినికి ఇబ్బందులు లేకుండా చూసుకుంది. విద్యార్థిని పరీక్ష రాయాలనే ఉద్దేశంతో అంబులెన్స్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించామని, పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ రాంరెడ్డి తెలియజేశారు.

రెండో రోజు ప్రశాంతం

పెంట్లవెల్లి: మండల కేంద్రం, జటప్రోల్ గ్రామాలో హైస్కూల్ సెంటర్‌లో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఎటువంటి సమస్యలు లేకుండా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు.. జటప్రోల్ ఇన్‌చార్జ్ బల రామకృష్ణారావు తెలియజేశారు. జటప్రోల్ సెంటర్‌లో ఒకరు గైర్హాజరయ్యారని చెప్పారు.

కార్మికులకు వేతనాలు అందజేయాలి


ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్లు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే ఆస్పత్రి కార్మికులు సమ్మె బాట పడుతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి. సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్త టెండర్ ప్రక్రియ పూర్తి చేసి తక్షణమే కార్మికులకు కొత్త వేతనాలను అమలు చేయాలని, పడకల సామర్థ్యానికి అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. ఆస్పత్రి ఎదుట కార్మికులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ కళాశాల కార్మికులు అజ్మీర, గౌరమ్మ, సంతోషి, రేణుక, ఖురాన్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 13 వాహనాలు వేలం వేశారు. వాహనాలకు నిర్ణయించిన ధర రూ.12.40 లక్షలు కాగా వేలంలో రూ.17.91 లక్షలు వచ్చాయి. ప్రభుత్వ ఖజానాలో జమ చేశామని ఎక్సైజ్ ఎస్ఐలు బాలరాజు, సతీష్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పారదర్శకంగా సేవలు


కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కల్వకుర్తి రూరల్: పాడి రైతులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మల్లయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయ డెయిరీ నూతనంగా ఆవిష్కరించిన పాలమిత్ర యాప్ వినియోగంపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. పెరిగిన పాల సేకరణ ధరలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జనరల్ మేనేజర్ మల్లయ్య, సత్యనారాయణ యాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

చారకొండ: మండలంలోని తుర్కలపల్లికి చెందిన జిట్టామోని శంకయ్య గతంలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో మంజూరైన రూ.10 వేల చెక్కును లబ్ధిదారుడికి తుర్కలపల్లిలో మంగళవారం మండల కోఆప్షన్ సభ్యులు సలీం, మాజీ సర్పంచ్ రాంకొండ అందజేశారు. నాయకులు మల్లయ్య, జగన్ తదితరులు ఉన్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం పదిలం


చెకప్ చేయించుకుంటున్న జడ్జి కుమారస్వామి

కల్వకుర్తి టౌన్: ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కుమారస్వామి అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మెడికల్ క్యాంపులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చార్లెస్ రాజుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. మంచి ఆహారంతో పాటు ఉదయాన్నే నడక, యోగాసాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవటంతో మన ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో స్వయంగా తనే వైద్య పరీక్షలు చేయించుకోవటంతో పాటు కోర్టు సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో వైద్యుడు శరత్‌కుమార్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు, కృష్ణయ్య, వెంకట్ గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్ఎం మంజుల, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలి



తెలకపల్లి: మన్ననూరు గురుకుల పాఠశాలలో మృతిచెందిన నిఖిత మరణానికి కారకులైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పుల్జాల పరశురాములు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని చైతన్య భారతి పాఠశాల ఆవరణలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిఖితది ముమ్మాటికి హత్యేనని అన్నారు. కార్యక్రమంలో అంతటి కాశన్న, నందిపేట భాస్కర్, హనుమంతు, బత్తిని రాజు, కొంగరి కాశన్న, జగదీశ్, ఉస్సేన్, జగన్ పాల్గొన్నారు.


కొనసాగుతున్న కంటి వెలుగు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. రఘుపతిపేట, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతాంజలి కోరారు. మంగళవారం మండల పరిధిలోని దారారం, జీల్కుపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్న వారందరికి ఆయా కేంద్రాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. అవసరమైన వారికి కళ్లజోడును పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కవిత, కొత్త ప్రసన్న, శ్రీనునాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల ఉన్నత పాఠశాలలో చేపట్టిన ‘మన ఊరు– మన బడి’ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మంగళవారం పాఠశాలలో పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్ బిల్డింగ్, వంటగది, కంపౌండ్ వాల్, బాత్‌రూం నిర్మాణ పనులు డిజిటల్ క్లాస్‌రూం పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. మాజీ సింగిల్‌విండో చైర్మన్ బాలస్వామి పాల్గొన్నారు.

బహుజనులంతా ఏకమవ్వాలి

బిజినేపల్లి: కలిసికట్టుగా పనిచేసి రాబోయే రోజుల్లో రాజ్యాధికారం సాధిద్దామని సంఘం మాదాసీ కురువ సంఘం రాష్ట్ర సభ్యులు బంగారి పర్వతాలు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మత్స్యకార్మిక భవనంలో ఆయా బీసీ కులాల నాయకులతో కలిసి కుల సంఘాల బలోపేతంపై చర్చించారు. ఆయా కుల సంఘాల నాయకులు అమీర్ అహ్మద్, తాజుద్దీన్, అల్లోజీ, రమణగౌడ్, కత్తి ఆంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.



తండాల అభివృద్ధికి కృషి


డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న శాంతి

వెల్దండ: గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ శాంతి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గాన్‌గట్టుతండాలో అండర్ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి పంచాయతీలో తండాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.40 లక్షలతో అండర్ డ్రెయినేజీలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి తండాలో సీసీరోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ పత్యానాయక్, గోపాల్‌నాయక్, భీముడునాయక్, ఫకీరనాయక్, మంగ్లానాయక్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


తెలకపల్లి డీపీఎంకు వినతి అందజేస్తున్న వీఓఏలు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎస్ఈఆర్‌పీ గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పీడీ నర్సింహకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత మాట్లాడారు. ఏప్రిల్ 3 నుంచి 16 వరకు తమ సమస్యలు పరిష్కరించపోతే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పనులను నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐకేపీ డీపీఎం వెంకటేశ్‌కు..

తెలకపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ డీపీఎం వెంకటేశ్‌కు వినతి అందజేశారు. మంగళవారం మండల కేంద్రం తెలకపల్లిలోని ఐకేపీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వర్ధం పర్వతాలు మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ నెల 3 నుంచి 16 వరకు ఆన్‌లైన్ పనులు బంద్ చేస్తామని, ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. పని భద్రత కల్పించకుండా వీఓఏలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు జగదీశ్, కేవీపీఎస్ జిల్లా నాయకులు నందిపేట భాస్కర్, ఏపీఎం నిరంజన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు


అజిలాపూర్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్ పల్లెచెరువు నుంచి నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెరువు నుంచి మట్టిని టిప్పర్ల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని రైతులు, గ్రామస్తులు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లో పంటలకు దుమ్ము చేరుతుందన్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేష్, మల్లేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, శేఖర్ ఉన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికి ‘ఉపాధి’


లింగాలలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగాల: జాబ్‌కార్డు కలిగిన వారందరికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామని ఎంపీడీఓ గీతాంజలి అన్నారు. మండలంలోని దారారం, కొత్తకుంటపల్లి గ్రామాల శివారులో చేస్తున్న పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవిలో ఉపాధి పనులకు వెళ్లి జీవనోపాధి పొందాలని కూలీలను కోరారు. మస్టర్లలో బినామీ పేర్లు లేకుండా చూసుకోవాలని, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. కుంటలు, చెరువుల్లో ఒండ్రుమట్టి తీయడం, కట్టలపై ఉన్న ముళ్లు, ఇతర చెట్ల పొదలను తొలగించడం లాంటి పనులను చేపడుతున్నట్లు తెలియజేశారు.

పనులు సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: వేసవి కాలంలో రైతులు, రైతు కూలీలు ప్రభుత్వం కల్పిస్తున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించి మాట్లాడారు. అధికారులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

లింగాల: త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని అవుసలికుంటలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడారు. మనస్పర్థలు వీడి సమన్వయంతో పనిచేయాలని, మండలంలో అక్కడక్కడా పార్టీలో కొంత అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తుందని, దానిని తొలగించుకోవాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పోలీస్‌స్టేషన్లు బీఆర్ఎస్ కార్యాలయాలుగా మారాయని, చివరకు గుళ్లు, గోపురాలను కూడా వదలడం లేదని విమర్శించారు. మండల కేంద్రంలోని రామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో బీఆర్ఎస్ బ్యానర్లను కట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అంతకు ముందు సమావేశంలో గ్రామాల వారీగా పార్టీ పరిస్థితులపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ లింగమ్మ, నారాయణగౌడ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రాథోడ్, బుడ్డయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

6 నుంచి జోడో యాత్ర

మండలంలోని అప్పాయపల్లి నుంచి ఈ నెల ఆరో తేదీ నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపడుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు తెలిపారు. ఏ గ్రామంలోని నాయకులు పాల్గొనాలని సూచించారు.

వైఫల్యాలపై ప్రశ్నిస్తే కేసులా?

కందనూలు: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతోనే ప్రశ్నపత్రాల లీక్‌లు జరుగుతున్నాయని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడిదల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ, ఎస్ఎస్సీ బోర్డు కార్యాలయాలను విద్యార్థుల పక్షాన ముట్టడిస్తే పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. నేతలు శివసేనారెడ్డి, బల్మూర్ వెంకట్‌లను జైలుకు తరలించడం దారుణమన్నారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ నిర్వాకంతో 30 లక్షల మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పకడ్బందీగా నిర్వహించాల్సిన పదో తరగతి ప్రశ్నపత్రాలు కూడా లీక్ అయ్యాయన్నారు. విద్యార్థి సంఘం నాయకులను విడుదల చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

అంబలి కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మొలచింతలపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాలనరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1980లో వచ్చిన కరువు రోజుల్లో జిల్లాలో అనేక వందల గ్రామాల్లో అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి పేద ప్రజల ఆకలి తీర్చిన ఘనత సీపీఐ కే దక్కిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫయాజ్, నాయకులు వెంకటస్వామి, శివుడు, సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

పంట పొలాలు, ప్రకృతి వనాలపై అవగాహన


వేరుశనగ పంటపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రకృతి సంపద, పరిసరాలు, పంటపొలాల సాగు, వనభోజనాలు వివిధ అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, మిరప సాగుచేసిన పంటపొలాలకు తీసుకువెళ్లి అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం విద్యాకమిటీ చైర్మన్ పొలం వద్ద విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం గిల్లిదండ, గోలికాయలు, పచ్చీస్, చెస్ పాతజ్ఞాపకాలను నెమరువేస్తూ చిన్ననాటి వివిధ ఆటల్లో విద్యార్థులను భాగస్వాములు చేశారు. సర్పంచ్ నిరంజన్, కృష్ణారెడ్డి, మోహన్‌సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.